# బల్లి పతనం

కామరాజు అద్దం ముందు నిలబడి గడ్డం చేసుకుంటున్నాడు. బుగ్గల మీద, నుదిటి మీద ముడతలు పడ్డా శరీరం పాల బిళ్ళలాగే వుంది. నవ నవ తగ్గలేదు. రేజరు యెడంగా తీసి కనుబొమ లెత్తి, గడ్డం మీద ఎడం చెయ్యివేసి పరికిస్తున్నాడు. తనలో యింకా చాలా బింకం వుంది. దేహ పటుత్వంవుంది. కాని యెటొచ్చీ జుట్టుకి ఇరుపక్కలా రెండు వెండిపాయ లేర్పడ్డాయి. పెదవి విరిచేడు. మెడెత్తి రేజరు మందంగా పోనిస్తున్నాడు. కళ్ళు మూతలు పడుతున్నాయి.

అసలు యీ జీవితం వొక పెద్ద సమస్య. 'క్షురస్య ధారా నిసితా దురత్యయా దుర్గమ్ పథం...' అన్నాడు. ఉహ్... ఎందుకు పుట్టాం? పుట్టి యేం చేశాం? చచ్చి యెక్కడి కెళతాం? దేనికీ రుజువూ సాక్షంలేని కేసు నెగ్గదని తనకెవరైనా చెప్పాలా. తను ప్లీడరువృత్తి ఆరంభించి నేటికి పద్ధెనిమిదేళ్ళయింది. తనకిపుడు నలభై రెండు నడుస్తోంది.

పెద్దవాడు చస్తే ప్లీడరు చదువు చదవనన్నాడు. లెక్చరరవుతాట్ట. ఏం బతుకు? తిరగలిలా. పెదిమలు బిగబట్టి మీసం ప్రాంతం మీద దాడి చేస్తున్నాడు. అయినా యిప్పుడు వుపాధ్యాయుడి జీవితం పూర్వంలా అంత రస హీనంగా లేదులే. మా రోజుల్లో గర్ల్ టీచర్సుగాని, లెక్చరర్స్‌గాని లేనే లేరు. 'వుమన్' అనబోయి నోరుజారి చిరునవ్వుతో వొక చిన్న దగ్గులాంటి శబ్దం చేస్తూ.

గడ్డం బిగించి గీస్తూ అనుకున్నాడు తిరిగి. అయితే చదువుకునే అమ్మాయిలు లేక పోలేదు. ముగ్గురుండేవారు. ప్రిన్సిపాల్‌గారి కూతురు, హిస్టరీ లెక్చరర్ కూతురు, వొక క్రిస్టియన్ అమ్మాయి. వాళ్లవైపుచూస్తే మేస్టర్లు ఒళ్లు హూనం చేసేవారు. తిరిగి రేజరు మెడ దగ్గర శవానుగా బిక్కరుతూంది. అయితే వాళ్లూ చాలా యిదిగా వుండేవారు. ఇప్పట్లాగా! ఇప్పుడసలు లింగ భేదం లేదు. ఎక్కడాయింతే— అసలు జీవితపు దృక్పథమే మారిపోయింది.

తిరిగి కళ్ళిప్ప చూసేసరికి తలలో వెండిపాయలు ఎదుర్కొన్నాయి. అయిపోతూంది జీవితం. వెధవకాలం, కోలగొట్టినట్టు అదే పోవడం... వెనక్కి తిరగదు. ఇహ వొచ్చే యేడాదొచ్చేది. నలభై మూడు గాని నలభై ఒకటి కాదుకదా... పెద్దమ్మాయి స్కూలుఫైనల్ తప్పింది. దానికి సైన్సులో వొటు. మనలాగే...మనకీ సైన్సు బాగావస్తే...మెడిసన్ చదివి...ఆహాహా ... ఆ ఆసుపత్రికి వెడితే మతి పోతుంది — నిరుడు తనకొక ఆపరేషన్ వొక లేడీ డాక్టర్ చేసింది...ఒళ్ళు చచ్చిపోయినట్టయింది. అయితే నేనేం జంకానా ... మర్నాడొచ్చి ఆవిడ హౌడుయూడూ మిస్టర్ అంటే ఒకే థాంక్యూ డాక్టర్ — అనేశా ధైర్యంగా ... అని పకాలున నవ్వాడు... కాని వెంటనే దిగజారి పోయేడు ... వెధవకాలం, వెధవకాలం— స్త్రీలకు కాదు మానభంగం పురుషులకి...

మూడోవాడు నాలుగోవాడు ప్రతి యేడూ పరీక్షలు ప్యాసవు తున్నారు. వాళ్ళ తర్వాత ఆఖరు పిల్ల మెరికలాంటిది. రేజరు తుడుస్తు న్నాడు. అదెక్కడ! అది నాలా మళ్ళీ ప్లీడరవుతుంది. ఈ రోజుల్లో ఆడవాళ్లు కూడా 'లా' చదువుతున్నారు కదూ ...

నడ్డి కరాలు మంచి. అసలీ నడ్డి బెణకడం రెండేళ్ళ క్రితమే ఆరంభించింది. అప్పుడే అనుకున్నా లక్షణాలు బైటపడుతున్నాయని.

విజయనగరంలో బి. ఏ. పూర్తి చేసిన తరువాత మేనమామ మద్రాసులో 'లా' చదవమన్నాడు. తనకి బొంబాయి వెళ్ళాలనుందంటే పడనిచ్చాడా? ఎందుకో ఆ పట్టుదల అనుకున్నా. తనక్కడే వున్నాడు కదూ ... ఇలా 'లా' చదువు ముగిసింది, అలా కట్టి పెట్టాడు గొంగళీ పురుగులాంటి కూతుర్ని. సీతితో జరిపిందే తన జీవితంలో రొమాన్సంతా...

మద్రాసులో చదువుకునే రోజులలో మేనమామ యింటి పక్క మళయాళీ డాక్టరుండేవాడు. అతని కూతురు అలిమేలు. మహా చెడ్డ చొరవగలది. నవ్వితే ముత్యాలు ఝళిపించినట్లుండేది. ఒకటే వాగుడు. మేడమీద తన గది కెదురుగా వాళ్ళ గది. కిటికీలు తెరుస్తే బరాబర్‌గా వుండేది. చనువుగా మాట్లాడేది. నేనసలు అందంగా వుండేవాడిని. అందుకే మీదపడి పోయేది, కాని నా ఒఋకు జబ్బే నా అవకాశాల నన్నీ పాడు చేసింది.

కామరాజు నీళ్ళు పోసుకుందికి లేవబోయాడు. గోడమీద గడియారం పది కొట్టింది. ఆదివారం కోర్టుకు శలవు. ఆఫీసు గది నిద్ర పోతూంది. గుమాస్తా వెంకట్రామయ్యని అవాళ రావొద్దన్నాడు. కొన్ని అర్జంటు వాయిదాల కాగితాలు చూసుకుందుకి వస్తానంటే ఒద్దన్నాడు.

వాయిదాల్ట, వెధవవాయిదాలు. ఈ వాయిదాలతో మన జీవితంలో మరవురాని నిముషాలు నిత్యవాయిదాలవుతున్నాయి. ఇల్లు ప్రశాంతంగా వుంది. ఈ రాత్రి మన జీవితంలో వొక నూతన మధు మాసం పసిడి రెక్కలు విప్పుతూంది. ఈ మెయిల్‌లోనే దిగుతున్నారు. పక్కింటి డైరెక్టరుగారి కుటుంబం. వాళ్ళు దేశం వెళ్ళి నెల కావస్తుంది. ఈ నెల వొక యుగంలా గడిచింది. సుభద్ర కోసం గుండెలు తల్లడిల్లి పోతూంటే... ఉఫ్... గాలి లేదు. ఫాన్ ఆగిపోయిందా... ఈ యెలక్ట్రిసిటీ వాళ్ళెప్పుడూ

యింతే. ఏవో తీయ తీయని ఆలోచనలు పడుతూ మనస్సు ఆందోళన పడుతూన్నప్పుడే కరెంటు ఆపేస్తారు... మన జీవితంలో కరెంటులాగే దీనికి అప్పుడే బ్రేక్ పడుతుంది...

కూర్గు దేశస్థులు చాలా అందంగా వుంటారు. మద్రాసులో చాలా మందిని చూశా. కాని సుభద్రలా యెవరుంటారు. ఆ చెంపకు చేరడేసి కళ్లు...ఆ గుజ్జులా యెత్తు...ఆ...ఆ...ఆచ్చి...వెధవయోగముక్కులో దూరిపోయింది. చచ్చినంతైంది ... తుమ్మితే తల తిరుగుతూంది ... ఇది కూడ లక్షణమేకాబోసు ...

వాసుదేవయ్య ఎగ్రికల్చర్ డైరక్టర్. వాసుదేవయ్య, కామరాజు యిరుగు - పొరుగు. సుభద్ర వాసుదేవయ్య కూతురు. లిటరేచర్ ఆనర్సు చదువుతూంది. తను బి. ఎ. స్పెషలింగ్లీషుతో పేసయి షెల్లీ, కీట్సువాడి వడబోసేడు. సుభద్ర తరచు తన దగ్గరకు వస్తూంటుంది. కామరాజు కబుర్లంటే సుభద్రకి సరదా. కామరాజుకి 'కాలేజా' లేదుగాని లెక్చరు దంచేడంటే సమ్మోహనంగా వుంటుంది.

అలిమేలు మృగతృష్ణలా తిప్పితిప్పి చేతికందినట్టె...జారిపోయింది. అసలా పిల్లమళయాళీది. నాకోపక్క బెదురుగానే వుండేది. ఏ కాఫీలోనో, కిల్లీలోనో మందు పెట్టేస్తుందని భయంగా వుండేది. కాని ... సుభద్ర... దేవతలాంటిది. అసలాపిల్ల నోటంట యింగ్లీషు వింటూంటే...ఫీ!

ఏ దొరసాన్లు పనిచేస్తారు! ... అతడు తలకొంచెం ఏరగాపెట్టి గోళ్లు కొరుక్కుంటూ చిరునవ్వుతో ఆలోచిస్తున్నాడు ... ఆవేళ షేక్స్పి యర్ని దుళ్ళగొట్టిననాడు తన లెక్చర్కి సుభద్రకి నోటమాట రాలేదు... ఇంట్లో చెంబులూ తప్పేళాలూ ప్రతిధ్వనించేయి. ఏ టాపిక్ ఎత్తుకున్నాను!

చెప్పి చెప్పి...రేప్ ఆఫ్ లుక్రీషియాలోకి దిగా ... అందం అంటే అది. రాక్షసుడిలోకూడా రమణీయమైన ఆలోచనలు మొలకెత్తిస్తుంది...అసలు! సీతకి బుద్ధిలేదు - దానికీ విషయాలేమైనా తెలిసేడిస్తేగా, పిల్లల్ని కనడం తప్పితే...మెల్లిగా మాట్లాడండి అని కేకలేసింది. పిల్లలు లేచిపోతారట! అసలు నేనేమిటి మాట్లాడుతున్నా, ఎవరితో మాట్లాడుతున్నా, అసలా గొంగళిపురుగుకి నేను సుభద్రతో మాట్లాడటం యిష్టంలేదు. నేనేం చిన్న వాడినా...అయిదుగురు పిల్లలవాడిని. నన్నెవరనుమానిస్తారు? అసలు మేం మాట్లాడుతున్నది సాహిత్యం ... అసలు సీతికి యీమధ్య నామీద అను మానం లావయినట్లుంది ... చంపేస్తున్నాడ పులిలా అహర్నిశలూ ... దాని అనుమానం మండిపోనూ ... అసలు మన జీవితమే క్లయింట్లు, దావాలు, వాయిదాలతో తెల్లవారిపోతూంది. మధ్య ఏదైనా యిలావొక ఆశాలత చిగిరిస్తే ... యీ సీతి దాన్ని కాస్తా దుంపనాశనం చేస్తుంది. అందుకే పిల్లలతో సహా పంపేశా వాళ్ళ చెల్లెలు కూతురు పెళ్లికి ... సరిగ్గా లెక్కవేశా వీళ్లు వెళ్లిన మూణ్నాళ్ళకి సుభద్ర వాళ్ళు దిగుతారు. సుభద్ర యివాళ రాత్రొస్తుంది...ఇవాళ వీనస్ అండ్ అడోనిస్ టాపిక్ యెత్తుతా...ఆ దెబ్బతో...ఈ ఫ్యాను మరితిరగదు ...అబ్బ యేవిటిది... టప్మని పడింది భుజంమీద...కుడిభుజంమీద వెధవబల్లి...కుడిభుజంమీద పడి టేబుల్మీదకి దూకింది...ఈ తుళ్లిపడటం కూడా ఒక లక్షణమే. తల వెంట్రుకలు నెరిశాయి...నడుం కరాలు మంటోంది ... ఈ తుళ్ళడం వోటి...కుడిభుజం మీద బల్లిపడితే, పడితే...దక్షిణభుజే...దక్షిణభుజే... ఏం చెప్పాడు శకునకారుడు...అదీ సంగతి. శకునం ఎలా ఫలిస్తుందని? రైట్ సుభద్ర దిగిందన్నమాట. గడ్డం నున్నగానే వుంది. సీతిలేదు ... వెంకమ్మగారూ ... అవ్వగారూ వంటైందా ... ఇదిగో స్నానంచేసి నేనూ సిద్ధం అవుతున్నా...చూడండీ రాత్రి కాకండి...నేను భోజనం చెయ్యను. కడుపులో బాగులేదు.

కామరాజు భోజనంచేసి కచేరీ చావిడిలో కొచ్చాడు. వీనస్ అండ్ అడోనీస్ చదవబోతున్నాడు. సీతమ్మా పిల్లలూ దిగారు. కామరాజుగుండె ఆగిపోయినట్టయింది. 'యేం వచ్చేశారు కబురూ కాకరకాయ లేకుండా... పెళ్ళాగిపోయిందా...'

'ఏం పెళ్ళి ... సరోజ ఎవడినో ప్రేమించిందట. అదీ వాడూ ఎటో పారిపోయారు. వాళ్ళా గొడవల్లో యిదౌతుంటే మధ్య మేమెందుకని వొచ్చేశాం...'

కామరాజు నోరెళ్ళబెట్టి టేబిలు మీంచి కిందపడిపోయిన బల్లి వేపు చూశాడు! నీ శకునం తగలెయ్యా' అనుకున్నాడు...